# ఇదీ వ్యాపారమే!

## 1

ఫోను రింగైంది.

"హలో !"

"... ... ..."

"ఆ ! ఏమిటి ?"

"... ... ..."

"నే నెందుకు ?"

"... ... ..."

"తప్పదంటే సరే !"

"... ... ..."

"ఓ. కె"

ఫోను కింద పెట్టాను. నాకంతా అగమ్యగోచరంగా వుంది. చంద్రారావు ఫోను చేశాడు. అతనేదో పెళ్లి చూపులకు వెడుతున్నాట్ట. నన్నూ రమ్మనమంటాడు. మధ్య నేనెందుకూ? తప్ప దన్నాడు. నాకు బయలుదేరక తప్పలేదు. వేషం మార్చి వీధిలో పోతున్న ఆటోరిక్షాని నిలిపి దానిమీద బైఠాయించాను.

"ఎక్కడికి, సార్ ?"

"మెస్సర్స్ చంద్రారావు & బ్రదర్స్"

చంద్రారావు నా మిత్రులలో ముఖ్యుడు అందులోనూ మేం క్లాస్‌మేట్సుం కూడా. ధనవంతుడి కొడుకైనమూలాన అతన్ని ముఖ్య స్నేహితుడిగా ఎంచుకున్న వాళ్లు చాలామంది వుండేవారు. వాళ్లల్లో అతను ముఖ్య స్నేహితుడిగా ఎంచుకున్నవాడ్ని నేనే!

అసలు మొదటి రోజుల్లో అతను నన్ను నిర్లక్ష్యం చేసేవాడు. ముఖస్తుతి, పరనింద నాకు చాతకావు పొగడ్తరాయుళ్ళందర్నీ నమ్మి, వాళ్ల కోతలకి మోసపోయి, ఆర్థికంగా చాలా చిక్కులు పడేవాడు, విద్యార్థి దశలో. చివరి రోజుల్లో నా స్నేహాన్నే పట్టాడు నా కష్టాల్ని

కొన్నిటిని గమనించి ఆర్థికంగా ఆదుకోబోతుంటే నే చేసిన ప్రతిఘటనే అతనికి నామీదగల సదభిప్రాయాన్ని బలపర్చడానికి తోడ్పడింది.

అంగడి ఎదుటే నాకు స్వాగతమిచ్చాడు.

కులాసా కబుర్లు అయ్యాక: "అసలు పెళ్లి చేసుకోననేవాడివిగా" అన్నాను, అసలు విషయాన్ని కెలకాలని.

"అన్నమాట నిజమే కాని పరిస్థితులు మారాయి" చిన్నగా నవ్వాడు.

ఆ నవ్వులో నాకేదో అనుమానం తోచింది. కాని దాన్ని మొహంమీద చదవలేకపోయాను.

"ఎన్నింటికి వెళ్లడం?"

"పదిన్నరకి."

కాసేపు ఎవరో వ్యాపారంమీద వొస్తే, నన్ను వొంటరిగా వొదిలి వెళ్లాడు.

చంద్రారావు గత చరిత్ర నా కళ్లముందు తిరిగింది. తండ్రి గొప్ప వ్యాపారస్తుడే కాని చివరి రోజుల్లో కొంత దెబ్బతిన్నాడు. చంద్రారావు అప్పుడే చదువుమాని వ్యాపారాన్ని చేబట్టాడు. అప్పట్నించీ అతను పట్టింది బంగారమవుతోంది. అతనికి గొప్ప వ్యాపారస్తుడని అనతి కాలంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు కలిగాయి. చాలా ధనవంతుడయ్యాడు.

కాని పెళ్ళిమాత్రం ఇంతవరకూ చేసుకోలేదు. కారణం తెలీదు.

కష్టాలున్న వాళ్లకే కష్టాలూ, ధనం వున్నవాళ్లకే ధనం రావడం ప్రపంచంలో జరిగే వింతల్లో ఒకటి.

అతను తిరిగి రావడంతో నా ఆలోచనలు కరిగిపోయాయి.

## 2

అనుకున్న ముహూర్తానికి పెళ్ళిచూపులకి వెళ్ళాం.

పెళ్లిచూపులు ఘనంగా జరిగాయి. వాళ్ల ఏర్పాట్లు నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేశాయి. వాళ్ళూ లక్షాధికారులే! అందుకని ఏర్పాట్లు చిన్న పెళ్ళికి చేసినట్లుగా చేశారు.

చంద్రారావు అంతసేపూ చాలా స్థిరచిత్తంతోనే వున్నాడు.

పెళ్లికూతుర్ని మాత్రం చూడడానికి అసహ్యం కలిగింది. జీడిరంగును పోలివుంది. ఆకస్మికంగా చూసినవాళ్లు, ఏ బొగ్గుగనిలోనో పనిచేసివచ్చి పొరపాటున మొహం చేతులూ కడుక్కోలేదుగావు ననుకుంటారు. అంత అనాకారిగావుంది.

కారులో తిరిగి వచ్చేటప్పుడు చంద్రారావు చెప్పాడు. వాళ్లకి ఒక్కతే కూతురట! ఆయన లక్షాధికారిట! ఇరవై వేలు కట్నం, వంద ఎకరాలు మాగాణి అల్లుడికిస్తానన్నాడుట. అదీకాక మామ అనంతరం అతనికే ఆస్తిపై సర్వాధికారం లభిస్తుంది–ఈలోపల అసంభవమైన కుమార సంభవమేదైనా జరిగితే వేరేమాట.

"నీకు పిల్ల నచ్చిందా ?" అన్నాను.

"దానికేం? అదంత ముఖ్యమైన విషయం కాదులే" అని చప్పరించాడు.

నే నింకేం మాట్లాడలేకపోయాను.

### 3

చంద్రారావు పెళ్ళి చాలా ఘనంగా జరిగింది. అనుకున్న లాంఛనాలన్నీ సవ్యంగానే జరిగాయి.

వాళ్ల దంపతుల ఫోటోలు పత్రికల్లో పడ్డాయి.

అతని పెళ్లికి దేశం నలుమూలలనుండి గొప్పవాళ్లంతా సందేశాలూ, కానుకలూ పంపారు.

చంద్రారావు అత్తారు అతనికంటె ఎన్నో రెట్లు ధనవంతులని వొప్పుకోక తప్పదు.

### 4

అతనికి బావమరిది కలిగాడనే వార్త వ్యాపారంలో అతని గొప్ప శత్రువులూ, బంధుత్వరీత్యా గొప్ప చుట్టాలూ అయిన వారికందరికీ అమితమైన ఆనందాన్ని చేకూర్చింది.

ఆ వార్తకు నా మనస్సూ చలించకపోలేదు.

ఓ నెల్లాళ్ళు పోయాక తీరుబడి చేసుకుని అతనింటికి వెళ్ళాను.

చంద్రారావు మామూలుగా మందహాసం చేస్తూ కన్పడ్డాడు. అతనిలో ఏవిధమైన ఆందోళన గాని కన్పడలేదు.

హైదరాబాద్ స్వీట్లూ, బాంబేహల్వా, బిస్కట్లూ అన్నీ పెట్టి, తినమని బలవంతపర్చాడు. అన్నీ రుచి చూసేటప్పటికే కడుపు నిండినట్టయింది.

ఆమాటా ఈ మాటా అయ్యాక నేనే కదిపాను.

"నీ మామగారికి కొడుకు కలిగాడుటగా"

"అవును"

"నీకు నష్టమేనే, పాపం"

"నే నేం వాళ్ల ఆస్తిని ఆశిస్తేగా సానుభూతి చూపడానికి"

"నిజంగా ఆ అమ్మాయిచేత ఆకర్షించబడే పెళ్ళాడావా?"

"కాదు!"

"మరీ?"

"అంతా వుందిలే!"

"నాదగ్గరా రహస్యమేనా?"

"రహస్యం కాదు. కొన్నాళ్లల్లో నీకే తెలుస్తుంది."

## 5

కొన్నాళ్ళల్లో నేను ఆ వూరు విడిచాను. చాలా రోజులవరకు చంద్రారావు విషయం తెలీలేదు.

ఒకనాడెవరో మావూరి షాహుకారు కలిస్తే అతని క్షేమం కనుక్కున్నాను.

ఇప్పుడు అతను భార్యను వదిలేశాడుట. ఆవిడ పుట్టింట్లోనే వుంటోందిట! వాళ్లకు ఏవో దావాలు అవీ నడుస్తున్నాయట! నాకదంతా అగమ్యగోచర మనిపించింది.

చంద్రారావు అంటే కిట్టనివాళ్లు ఎందరో వున్నారు, అవన్నీ వాళ్లు కల్పించిన విషయాలేమో ననుకున్నాను.

ఎంత రెట్టించి అడిగినా ఆ షాహుకారు అసలు కారణం నాకు చెప్పలేకపోయాడు.

నా ఆత్రుత ఎక్కువైంది. మా వూరు వెళ్లే రోజుకోసం నిరీక్షించసాగాను.

## 6

మావూరు వెళ్ళిన రెండుగంటల్లోపలే చంద్రారావుని కలిశాను.

అతను యథాప్రకారముగానే కనపడ్డాడు.

విషయమంతా అడిగాను.

"నీకు ఆశ్చర్యం కలిగించిందా?"

"కాక?"

"ఐతే అసలు విషయం విను. నీ కేమీ వింత అనిపించదు.

"అసలు నేనప్పుడు పెళ్లిచేసుకోడానికి ఎందుకు అంగీకరించాననుకున్నావు? పార్లమెంటులో ఒక బిల్లు పాసైంది, దాన్ని ఆధారంగా నా వ్యాపారాన్ని వృద్ధి చేసుకోదల్చుకున్నాను.

"వాళ్ల ఆస్తిని నే నెప్పుడూ ఆశించలేదు. వాళ్లు ఐచ్ఛికంగా ఇచ్చే కట్నం తీసుకున్నాను. అందులో నేనేమీ బేరసారాలు చెయ్యనిది నువ్వూ గమనించే వుంటావు.

"ఇంక రెండో విషయం. ధనవంతులైన భార్యల్నుండి, భర్తలు విడాకులు తీసుకుంటే, భార్యలే భర్తలకు మనువర్తి ఇవ్వాల్సి వస్తుంది – ఆ బిల్లు ప్రకారం. ఆ బిల్లు ననుసరించి దావావేసి దాన్ని కూడా పొందాను" అన్నాడు విజయగర్వంతో మెరుస్తున్న కళ్ళతో చూస్తో.

నేను ఆశ్చర్యంలో మునిగాను! 'ఇదీ వ్యాపారమే!' అనుకుంటూ.

*22. 06. 1955–ఆంధ్ర సచిత్ర వారపత్రిక*